ఎడ్లబండ్లతో నిరసన తెలుపుతున్న రైతులు

ఎండుతున్న పంటలు...

- కురవని వర్షం -కనికరించని ప్రభుత్వం... - ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రజాశక్తి-ఆలూరు

వర్షమేదైనా తల్లిదండ్రులు పిల్లలను అల్లారుముద్దుగా పెంచుకుంటారు. ఏ చిన్న బాధ వచ్చినా తల్లడిల్లిపోతారు. రైతులు కూడా పంటలను బిడ్డల్లాగే కాపాడుకుంటారు. దుక్కి దున్ని, విత్తు వేసినప్పటి నుంచి పంట రోగాలబారిన పడకుండా చూసుకుంటారు. ప్రస్తుత వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయి. రైతు పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరీ కష్టపడుతున్నాడు. ట్యాంకర్ల ద్వారా పంటకు నీటిని అందిస్తున్నాడు.

ట్యాంకర్‌తో నీటిని పడుతున్న రైతు

జిల్లా పశ్చిమ ప్రాంత పట్టణ, గ్రామాల్లో ఏ రైతును పలకరించినా ఈ కష్టాలు కంటబడతాయి. ఆలూరు నియోజకవర్గంలో జూన్ నెలలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి, మిరప, వేరుశనగ, జొన్న, ఆముదం పంటలను సాగు చేశారు. నియోజకవర్గంలో దేవనకొండ మినహా ఐదు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,74,167.5 ఎకరాల్లో పంట సాగు చేశారు. ప్రధానంగా పత్తి 94,602.5 ఎకరాలు, మిరప 44,900 ఎకరాలు, ఉల్లి 3,940 ఎకరాలు, వేరుశనగ 3,222.5 ఎకరాలు, కంది 13,707.5 ఎకరాల్లో సాగు చేశారు. ఆగస్టు నెల నుంచి వర్షం కురవకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. మిరప పంటకు రూ.లక్షల పెట్టుబడి పెట్టి ఎండిపోతున్న తరుణంలో రైతు చూడలేక పంటను బతికించేందుకు నీటి ట్యాంకర్లతో పంటను తడుపుతున్నాడు.

కురవని వర్షం.. - కనికరించని ప్రభుత్వం..

నియోజకవర్గంలో ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, హోళగుంద మండలంలో మిరప పంటను కాపాడుకొనేందుకు రూ.లక్షలు ఖర్చు పెట్టి నీటి ట్యాంకర్లతో నీరందిస్తున్నారు. జూన్‌లో కురిసిన వర్షాలకు రైతులు విత్తనం వేసుకోగా ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు వర్షం కురవలేదు. ఒక్క నియోజకవర్గమే కాక జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని రైతులు, రైతు సంఘాల నాయకులు తెలుపుతున్నారు. ప్రభుత్వం మాత్రం రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ మాయమాటలు చెబుతోందని విమర్శకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు విమర్శిస్తున్నారు. జిల్లాను కరువు ప్రకటించి తక్షణమే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఆందోళనలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ప్రభుత్వం రైతులపై కనికరం లేకుండా మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టాను

- చిన్న రంగన్న, రైతు, మనేకుర్తి

4 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశా. జూన్‌లో కురిసిన వర్షానికి నీటి కుంటలో నీరు నిల్వ ఉండడంతో ఆగస్టు చివరి వరకు ఆ నీటితో ఆయిల్ ఇంజన్ పంపుతో మిరప పంటను బతికించుకున్నాను. నీరు లేకపోవడంతో ఎండుముఖం పట్టింది. పంటను బతికించుకునేందుకు తప్పని పరిస్థితిలో అప్పు చేసి 100 నీటి ట్యాంకర్లతో ప్రస్తుతం పంటకు నీటిని అందించా. ఇలాగే వర్షం రాకపోతే పెట్టుబడి పెట్టలేక అప్పులపాలు కావాల్సిందే.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఈరన్న, రైతుసంఘం మండల కార్యదర్శి, ఆలూరు

ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయి. ఏం చేయాలో తోచక దిగాలు చెందుతున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. లేకపోతే రైతు ఆత్మహత్యలు దారి తీస్తుంది. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతుల ఆగ్రహానికి బలి కావాల్సి వస్తుంది. నష్టపరిహారం కింద రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

- సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, జనసేన ఆధ్వర్యంలో రహదారి దిగ్బంధం
- ఎడ్లబండ్లతో రైతుల నిరసన

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, జనసేన ఆధ్వర్యంలో తుగ్గలిలోని గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారిని దిగ్బంధించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎడ్లబండ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు దేవపెద్ది ప్రకాష్, టిడిపి అధికార ప్రతినిధి మనోహర్ చౌదరి, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, టిడిపి మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, కాంగ్రెస్ నాయకులు నాగార్జున మాట్లాడారు. అత్యంత వెనుకబడిన తుగ్గలి మండలాన్ని ప్రభుత్వము కరువు ప్రకటించకపోవడం బాధాకరమని తెలిపారు. నిత్యం కరువు కోరల్లో చిక్కుకునే తుగ్గలి మండలాన్ని అధికారులు ఎందుకు కరువుగా ప్రకటించలేదో అర్థం కావడం లేదన్నారు. తుగ్గలి మండలాన్ని కరువుగా ప్రకటించకపోవడం పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని తెలిపారు. సక్రమంగా వర్షాలు కురవక పంటలు పండకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని చెప్పారు. ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వర్షపాతం తక్కువ నమోదైనప్పటికీ తుగ్గలి మండలాన్ని కరువుగా నిర్ణయించలేదని తెలిపారు. వర్షాలు కురవకపోవడంతో పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయని చెప్పారు. తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించే వరకు ఆందోళనలను విరమించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తుగ్గలి మండలాన్ని తక్షణమే కరువుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. రైతుసంఘం నాయకులు కొండారెడ్డి, గురుదాసు, ఉమాపతి, రంగరాజు, సిఐటియు నాయకులు ప్రతాప్, టిడిపి నాయకులు పల్లె వెంకటేష్, కిష్టయ్య, త్రిమూర్తులు, రవి, వివిధ గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

15న భారీ బహిరంగ సభ

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో అసమానతల్లేని అభివృద్ధి జరగాలని కోరుతూ సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో చేపట్టే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి కోరారు. గురువారం కర్నూలు నగరంలోని సుందరయ్య భవన్‌లో 'చలో విజయవాడ' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారాలు వేశాయని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వలసలను నివారించాలని, ఉపాధి హామీ చట్టం కింద 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిజెపి గురించి ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని తెలిపారు. ప్రజా సమస్యలన్నీ పక్కకెళ్లి కేవలం రాజకీయ నాయకుల చుట్టూ రాష్ట్ర రాజకీయాలకు తిరుగుతున్నాయని, ప్రజా సమస్యలే అజెండాగా ప్రజల ముందు పెట్టడానికి సిపిఎం ప్రజారక్షణ భేరి నిర్వహిస్తోందని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు, కెవి.నారాయణ, రామకృష్ణ, నగర కార్యదర్శి రాజశేఖర్, రాముడు పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

4, 5న ప్రత్యేక ఓటరు నమోదు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఈనెల 4, 5న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గతనెల 27న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, అందులో ఏమైనా తప్పులు, పొరపాట్లు జరిగి ఉంటే సంబంధిత ఎఇఆర్‌ఒ, ఇఆర్‌ఒ, బిఎల్‌ఒ లేదా జిల్లా ఎన్నికల అధికారికి సంబంధిత ఫారంలో డిసెంబర్ 9లోపు అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని తెలిపారు. చనిపోయినా లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారినా, వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలని చెప్పారు. పై సవరణలన్నీ పూర్తయిన తర్వాత ఎలాంటి తప్పులకూ ఆస్కారం లేకుండా వచ్చే జనవరి 5న ఓటర్ల జాబితా ప్రచురిస్తున్నట్లు తెలిపారు. బెల్ కంపెనీ నుంచి 16 మంది ఇంజినీర్లు అక్టోబర్ 16 నుంచి ఫస్ట్ లెవెల్ చెకింగ్ చేస్తున్నారని, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తయిన తర్వాత నమూనా పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జీ డిఆర్‌ఒ మల్లికార్జునుడు, రాజకీయ పార్టీ ప్రతినిధులు వైసిపి నుంచి స్టేట్ లీగల్ జనరల్ సెక్రటరీ పుల్లారెడ్డి, కాంగ్రెస్ నుంచి బిటి.స్వామి, టిడిపి నుంచి ఎల్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

మూడురోజుల్లోపు లేఅవుట్ ప్లాన్ ఇవ్వాలి

- ఆర్‌యు భవనాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అన్ని భవనాలకు సంబంధించిన లేఅవుట్ ప్లాన్‌ను రూపొందించి మూడు రోజుల్లోపు తనకు సమర్పించాలని కల్లూరు తహశీల్దార్‌ను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రాయలసీమ యూనివర్సిటీ భవనాలను కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవిఎంలను భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్ ఏర్పాటు చేసేందుకు వర్సిటీలోని లైఫ్ సైన్స్, ఇంజినీరింగ్ బ్లాక్, డేటా సెంటర్, లైబ్రరీ, పాత లైబ్రరీ, అకాడమిక్ బ్లాక్-2 తదితర భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే నగరంలోని ప్రాంతీయ ముద్రణ కార్యాలయాన్ని కూడా పరిశీలించారు. రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటసదానంద, ఇన్‌ఛార్జీ డిఆర్‌ఒ మల్లికార్జునుడు, కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్, కల్లూరు తహశీల్దార్ రమేష్ బాబు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీలో పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కెవి సుబ్బారెడ్డి

శ్రీలక్ష్మి కాలేజీలో కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ ఇంటర్ కొలిగేట్ వారి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ కాలేజీలో కబడ్డీ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణగా ఆడి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పోటీలలో పక్షపాత నిర్ణయాలను తీసుకోకుండా విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. కళాశాలల కరస్పాండెంట్ విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఓడిపోయిన విద్యార్థులు కుంగిపోకుండా మరింత కష్టపడి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ అండ్ సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్ డాక్టర్ కె.వి శివ కిషోర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కన్నా కుమార్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, శ్రీలక్ష్మి B.P.Ed కాలేజ్ ఇంచార్జ్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్ పర్సన్, ప్రిన్సిపల్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహులు, శివ పాల్గొన్నారు.

పొలానికి దారి ఇవ్వకుండా దౌర్జన్యం

- జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలంటూ బాధితుడు వేడుకోలు

ప్రజాశక్తి - సి బెళగల్

'మా పొలానికి దారి ఇవ్వకుండా సలీమ్ శంకర్ మాజీ బినామీ బారికి శ్రీనివాసులు దౌర్జన్యం చేస్తున్నాడు. జిల్లా కలెకర్ న్యాయం చేయాలి' అని బాధిత రైతు మహేంద్ర మొర పెట్టుకొన్నారు. గూడూరుకు చెందిన బాధిత రైతు మహేంద్ర గురువారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి రెవిన్యూ శివారు సర్వే 638లో తనకు మూడు ఎకరాలు ఉందని, అందుకు పులకుర్తి- గూడూరు రోడ్డు గుండా ఎల్లెల్సి కాల్వగుండా బోయ లింగన్న పొలం దగ్గరికి దారి ఉందన్నారు. అక్కడి నుండి బోయ లింగన్న పొలంలో ఆరు అడుగులు, బారికి శ్రీనివాసులు పొలంలో ఆరు అడుగులు ఏళ్లుగా దారి ఉందని, అయితే తన పొలం ఎలాగైనా కాజేయాలన్న స్వార్థంతో అటు దారి ఇవ్వకుండా, ఇటు ఎల్లెల్సీ కాల్వగుండా పోనివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులను, రెవిన్యూ అధికారులను అశ్రయించినా దౌర్జన్యకారులకే వత్తాసు పలుకుతున్నారని, జిల్లా ఉన్నత అధికారులు దృష్టి సారించి పొలానికి దారి చూపించి న్యాయం చేయాలని కోరాడు.

మాట్లాడుతున్న బాధిత రైతు

కరువు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కరువు జిల్లా అయిన కర్నూల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కర్నూల్ నగరంలోని ఇందిరాగాంధీ నగర్ పార్వతయ్య భవనం (డివైఎఫ్ఐ కార్యాలయం)లో వార్డు కార్యదర్శి విక్రమ్ అధ్యక్షతన డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నగేష్, స్పోర్ట్స్ జిల్లా కన్వీనర్ శంకర్ మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత అత్యంత వెనుకబడిన జిల్లాగా కర్నూలు ఉందని, ప్రతి సంవత్సరం 6 లక్షల మంది వలసలు వెళ్తున్న పరిస్థితి ఉందన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు జిల్లా అయిన కర్నూల్‌లో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో బీటెక్ ఫార్మసీ, ఇతర డిగ్రీలు, పీజీలు, ఐటిఐలో చదివిన లక్షలాది మంది విద్యార్థులకు సరైన ఉద్యోగాలు లేక కూలి పనికి, ఆటోలు వేసుకొని బతుకు బండి ఈడుస్తున్న పరిస్థితి ఉందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలన్న మోడీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అన్న జగన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేంద్రంలో పది లక్షలు, రాష్ట్రంలో 2.36 లక్షలు ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీ ఉన్నా భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి యువతను దుర్భర పరిస్థితికి నెట్టివేశారని ఆరోపించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సాయి, ఈశ్వర్, మహేష్, సంపత్, నాగేంద్ర, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై.నగేష్

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పాణ్యం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం చిన్న కొట్టాల, పెద్ద కొట్టాల గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేచారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు, రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి జరగబోయే లబ్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, పెద్ద కొట్టాల రంగారెడ్డి, మురళి రెడ్డి, ఖాసిం, హుస్సేన్, చిన్నకొట్టాల తలారి శ్రీనివాసులు, నాగరాజు, వెంకట స్వామి, మాజీ ఎంపీపీ వాకటి మాధవీ, మాదేష్, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కల్లూరు అర్బన్ నాయకులు పెద్దపాడు తిరుమలేశ్ రెడ్డి, పెద్ద బీచుపల్లి, చిన్న బీచుపల్లి, ధనుంజయ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, పెద్దటేకూరు తరుణ్ రెడ్డి, దూపాడు లోకేష్, బొల్లారం రమణ రెడ్డి, విజయ్, బస్తిపాడు రాజు, మాజీ ఎంపిటిసి శేఖర్ రెడ్డి, మధు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొట్టాలలో ప్రచారం చేస్తున్న గౌరు చరిత రెడ్డి

రీ సర్వే పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రీ సర్వే పనులను త్వరితగతిన వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్‌ఏ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అసైన్మెంట్ భూములకు సంబంధించిన వాటిలో 360 వాటికి ఎల్పిఎం జనరేట్ చేశామని, మిగిలిన వాటిని శనివారంలోపు పూర్తి చేస్తామని వివరించారు.

ఇంటర్-యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు 'అశోకా' విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్‌కి చెందిన బి.టెక్ సెకండియర్ విద్యార్థినులు ఎ.నేహ, జె.నాగ ప్రవళ్ళిక కబడ్డీ ఆటలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి జెఎన్‌టియూఏ ఇంటర్-యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కాలేజ్ ప్రిన్సిపల్ డా ఆర్ నవీన్ తెలిపారు. జేఎన్టీయూఏ-అనంతపురం ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ బుధవారం తిరుపతిలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్‌లో నిర్వహించిన కబడ్డీ ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్స్ టీమ్ ఎంపిక పోటీల్లో కర్నూలుకి చెందిన అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థినులు ఎ.నేహ, జె.నాగ ప్రవళ్ళిక ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సెలక్షన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఎన్‌టియూఏ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి జోజిరెడ్డి ఎంపికైన క్రీడాకారిణిలను, ఫిజికల్ డైరెక్టర్స్ ప్రశాంతి, జయలక్ష్మి, ప్రోత్సహించిన అశోకా కాలేజ్ మేనేజ్మెంట్‌ని అభినందించారు. కార్యక్రమంలో జెఎన్‌టియూఏ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులను అభినందిస్తున్న బి.జోజిరెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్ ఖాన్

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ బాధ్యత, ధ్యేమని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్ తెలిపారు. గురువారం 44వ వార్డ్ 114 సచివాలయం, రామలింగేశ్వ నగర్, సీతారాం నగర్ పరిధిలో జరిగిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అవ్వ తాతలకు పెన్షన్లను స్థానిక వార్డు నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన పలు సమస్యలను సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడి పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజయ డైరీ జిల్లా చైర్మన్ యస్.వి జగన్ మోహన్ రెడ్డి, 44వ వార్డ్ కార్పొరేటర్ రాజేశ్వర్ రెడ్డి, గోశాల చైర్మన్ అది మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు కర్ణాకర్ రెడ్డి, రైల్వే ప్రసాద్, మెర్రి, జ్యానందం, భాను, స్వాతి, ఖాజా, రాముయాదవ్, జంగిల్లమ్మ, మధుసూదన్ రెడ్డి, సవారి, శివ మోహన్ రెడ్డి, శివ రెడ్డి, లక్ష్మీపతి, కృష్ణారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

టిడిపి వారయితే పాస్ పుస్తకం మంజూరు చేయరా..? : మహిళా రైతు

ప్రజాశక్తి - పత్తికొండ

కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ, టిడిపి వారు అయితే పొలం పాస్ పుస్తకం మంజూరు చేయరా అని మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం స్థానిక విలేకరులతో బాధితురాలు మహిళా రైతు బోయిని రామలక్ష్మి మాట్లాడుతూ పత్తికొండ మండలం హెూసూరు గ్రామానికి చెందిన తన భర్త బోయిని కిష్టన్న టిడిపి మాజీ ఎంపీటీసీ అని, పత్తికొండకు చెందిన పొలం పాస్ పుస్తకం కోసం నాలుగు సంవత్సరాలుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తహశీల్దార్ విష్ణు ప్రసాద్‌కు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. తన భర్త టిడిపి నాయకుడనే అక్కసుతో నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండలో సర్వే నెంబర్ 283లో 0.70 సెంట్లు పొలానికి పాస్ పుస్తకం ఇవ్వకుండా తహశీల్దార్, విఆర్‌ఒ మాపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత నెల జిల్లా కలెక్టర్‌కు స్పందనలో న్యాయం చేయాలని అర్జీ అందజేసినా ఫలితం లేదని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తనకు పొలం పాసుపుస్తకం మంజూరు చేయించి న్యాయం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న బాధిత మహిళా రైతు బోయిని రామ లక్ష్మమ్మ

గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

బహిరంగ సభను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి రాష్ట్ర బస్సు జాతా ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ కోరారు. గురువారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తును సక్రమ మార్గాన్ని నడిపించేందుకు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. రాష్ట్రాన్ని విడగొట్టి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, రాష్ట్ర విభజన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగ నమ్మడానికి తయారయిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రజలపై భారాలు వేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ నిరసనను కూడా తెలియజేయడానికి వీల్లేకుండా నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, పట్టణ నాయకులు నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

సుంకేశ్వరిలో కమ్యూనిటీ హాలు ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాలు భవనాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి ప్రారంభించారు. గురువారం గ్రామానికి చేరుకున్న రాంపురం రెడ్డి సోదరులకు, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డికి సర్పంచి ముక్కరన్న శాలువా, పూలమాలలు వేసి సన్మానించి, స్వాగతం పలికారు. గ్రామంలోకి ప్రవేశించిన వారికి కమ్యూనిటీ హాలు భవనం వరకు ఎద్దుల బండిపై ఊరేగింపు నిర్వహించారు. కమ్యూనిటీ హాలు భవనం వద్ద రాంపురంరెడ్డి సోదరులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అతిథులకు పూలమాలలు, శాలువాలు వేసి సన్మానించారు. ఎస్ఐ కిరణ్, పిఆర్ డిఇ అశ్వత్థామ, ఎఇ నరసింహులు, మంత్రాలయం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.

ఎద్దులబండిపై ఊరేగిస్తున్న నాయకులు

అభివృద్ధికి మారు పేరు బీవీ

- మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి

- ఘనంగా బీవీ.మోహన్ రెడ్డి జయంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అభివృద్ధికి మారు పేరు బీవీ.మోహన్ రెడ్డి అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి 75వ జయంతి వేడుకలను నిర్వహించారు. బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీవీ.మోహన్ రెడ్డి హయాంలో ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం, పెద్దకడబూరు, కోసిగి మండలాల్లో డ్రెయినేజీలు, రోడ్లు, స్కూళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, తాగునీటి పైపులైన్లు, ఇళ్ల స్థలాలు, ఇల్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు సుందర్ రాజు, రామదాసు గౌడ్, దయాసాగర్, కలీముల్లా, మల్లికార్జున, రంగస్వామి గౌడ్, మధుబాబు, వాల్మీకి శంకరయ్య, పార్లపల్లి మల్లికార్జున, కటారి రాజేంద్ర, అంజి, వడ్డే కృష్ణ, కె.తిమ్మాపురం ఉప సర్పంచి చాకలి ఉరుకుందు, మాబు, అయ్యాలప్ప, దేవదాసు, గాజుల సుధాకర్ పాల్గొన్నారు.

బీవీ.మోహన్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

తప్పుల్లేని ఓటరు జాబితా లక్ష్యం

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు అందరూ సహకరించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి పొరపాట్లు ఉంటే తెలపాలని అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతనెల 27న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, ఏమైనా తప్పులు, పొరపాట్లు జరిగి ఉంటే సంబంధిత ఎఇఆర్‌ఒ, ఇఆర్‌ఒ, బిఎల్‌ఒ లేదా ఆదోని ఎన్నికల అధికారికి సంబంధిత ఫారంలో డిసెంబర్ 9లోపు అందజేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని తెలిపారు. చనిపోయినా లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారినా వారి ఓటు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలని చెప్పారు. వచ్చే జనవరి 5న ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈనెల 4, 5న, డిసెంబర్ 2, 3న ఓటరు నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కొత్తగా ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్లు రజనీకాంత్ రెడ్డి, ఇజాజ్ అహ్మద్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి విజయ శేఖర్ ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

ఆదోని డివిజన్‌లో బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా గ్రామ, వార్డు స్థాయి అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు హాలులో బాల్య వివాహాల నివారణపై డివిజన్, మండల స్థాయి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు, పేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు బాల్యవివాహాల పట్ల మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను నియంత్రించేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, తదితర శాఖల సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వివాహం చేస్తున్నారని తెలియగానే సంబంధిత ఉపాధ్యాయులు తెలియజేయాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో బాల్యవివాహాల నియంత్రణపై చర్చించాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసు, ఇతర సిబ్బంది బాధ్యత తీసుకొని బాల్యవివాహాలు నియంత్రించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి, సీతారామయ్య, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

వైసిపి గెలుపే ధ్యేయంగా పని చేయాలి

- గుమ్మనూరు నారాయణస్వామి

ప్రజాశక్తి - ఆస్పరి

వైసిపి మళ్లీ అధికారంలోకి రావాలంటే నాయకులు, కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు అధ్యక్షతన 'మా నమ్మకం నువ్వే జగన్, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోని సచివాలయాల్లో 'మా నమ్మకం నువ్వే జగన్, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' నిర్వహించాలని సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు, వాలంటీర్లకు, నాయకులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, ఆలూరు ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరామ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్ భీంనాయుడు, జడ్‌పిటిసి దొరబాబు, మండల కన్వీనర్ పెద్దయ్య, జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు, మండల కో కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, సొసైటీ సిఇఒ అశోక్, వైసిపి ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాం

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ

- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలోనూ పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించామని తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్, జనసేన పార్టీ నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకులు అడిగిన ప్రతి విషయాన్ని తహశీల్దార్ లక్ష్మీనారాయణ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడా అవకతవకలు జరగకుండా పగడ్బందీగా ఓటరు జాబితాను తయారు చేశామన్నారు. ఓటరు జాబితాపై అనుమానాలుంటే వెంటనే తెలియజేయాలని కోరారు. మండలంలోని మొత్తం 23,713 మంది ఓటర్లు ఉండగా మహిళలు 11,881, పురుషులు 11,832 ఉన్నట్లు తెలిపారు. ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య, టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, కాంగ్రెస్ నాయకులు వినోద్, సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్

సమస్యలు వింటూ ముందుకు...

- నాలుగో రోజూ 'గడపగడపకు'లో ఎర్రకోట

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి చేపట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం'లో సమస్యలు వింటూ, సమాధానం ఇస్తూ ముందుకు సాగారు. గురువారం నాలుగో రోజు గోనెగండ్లలోను, సాయంత్రం ఎర్రబాడు గ్రామంలో కొనసాగింది. గోనెగండ్లలోని గొల్ల గేరి నుంచి ప్రారంభించి స్టేట్ బ్యాంకు, గద్వాల గేరి, సుంకులమ్మ గుడి మీదుగా ఎస్సీ కాలనీ వరకు నిర్వహించారు. ప్రతి ఇంట్లో లబ్ధిదారులకు అందుతున్న పథకాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గద్వాల గేరిలో మహిళలు దశాబ్దాలుగా తాము మురుగునీటితో సహవాసం చేస్తూ తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆగ్రహంతో ఆవేదన వెలిబుచ్చారు. ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి సమస్యలను సామరస్యంగా వింటూ, చిరునవ్వుతో సమాధానం ఇస్తూ ముందుకు సాగారు. జల జీవన్ మిషన్ పనులు పూర్తికాగానే త్వరలోనే ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఎస్‌బి.మన్సూర్, టి.బందే నవాజ్, దొరబాబు నాయుడు, రంగన్న నాయుడు, శివ రాముడు, కామర్తి పద్మనాభం, బగిలి ఉస్మాన్, బజారి, మునెప్ప, పూజారి రంగస్వామి, అబ్బుసా, మాబు, పంచాయతీ కార్యదర్శి సతీష్, వెల్ఫేర్ అసిస్టెంట్లు విరుపాక్షి, అనిల్ పాల్గొన్నారు.

గద్వాల గేరి మురుగునీటి సమస్యను పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి

భూస్వామిపై స్వామి భక్తి...

- అధికారులను తప్పుదోవ పట్టించి, పేదరాలి బంకు తొలగించిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్ బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

భూస్వామిపై స్వామి భక్తి ప్రదర్శించి, పేదరాలి బంకును తొలగించిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం బంకు తొలగించిన ప్రదేశాన్ని ఆనంద్ బాబు, సిపిఎం మండల నాయకులు కరుణాకర్, గ్రామస్తులు గోవిందులు, గిరి, రాజుతో కలిసి పరిశీలించారు. బాధితురాలు సకినాబీ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన వివరాల మేరకు... మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో కొద్ది నెలల క్రితం వివిధ కారణాలతో ముగ్గురు మృతి చెందారు. వారి మృతదేహాలకు అంత్యక్రియలు చేసేందుకు శ్మశానం లేక ప్రజలు ఆందోళనకు దిగారు. పంచాయతీ, ఇతర శాఖల అధికారులు స్పందించలేదు. చివరికి ఒక దశలో గ్రామ సచివాలయం ముందు అంత్యక్రియలు నిర్వహించేందుకు మహిళలు పూనుకోగా, అధికారులు ఏదో ఒకచోట ఖననం చేయించారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన పి.సకినాబీ (55) అనే మహిళ మామ మౌలాలి, భర్త హుస్సేన్ చనిపోయిన తర్వాత గ్రామంలోని నాలుగు రోడ్ల వద్ద ఆర్‌అండ్‌బి స్థలంలో నాలాపై చిన్న హోటల్ పెట్టుకుని, టీ, అల్పాహారం అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ బంకుకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న నెపంతో పంచాయతీ కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు గతనెల 31న సిబ్బందితో తొలగించారు. అగ్రహారం గ్రామంలో 40 ఏళ్లుగా సకినాబీ ఆర్‌అండ్‌బి స్థలంలో కాలువపై నడుపుకుంటున్న హోటల్‌ను ప్రొక్లెయిన్‌తో ధ్వంసం చేయించిన పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌పై చర్యలు తీసుకుని, సకినాబీ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి. గ్రామానికి ఎలాంటి అసౌకర్యమూ కలుగకపోయినా, గ్రామస్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందకపోయినా గ్రామ పెత్తందారు ధన దాహానికి కక్కుర్తి పడి ఉన్నతాధికారులను కూడా తప్పుదోవ పట్టించి గ్రామంలో సచివాలయ ప్రారంభానికి వచ్చిన పోలీసుల సహకారం తీసుకుని సకినాబీ టీ హోటల్‌ను కూల్చడం దుర్మార్గం. నిజంగా అడ్డుగా ఉంటే ముందస్తు నోటీసు ఇవ్వాలి. వివరణ తీసుకోవాలి. పక్కనే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని షాపులు నిర్మించుకున్న భూస్వామికి అడ్డుగా వస్తుందని స్వామి భక్తిని ప్రదర్శించిన పంచాయతీ కార్యదర్శి సకినాబీ టీ హోటల్‌ను ధ్వంసం చేయించి ఆర్థిక నష్టం కలిగించారు. జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకొని పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలి. సకినాబీ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి. లేకపోతే సకినాబీ కుటుంబానికి అండగా గ్రామస్తులందరినీ కలుపుకొని జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాం.

బంకు శిథిలాలను చూపుతున్న కుటుంబ సభ్యులు

IN THE COURT OF THE PRINICIPAL JUNIOR CIVIL JUDGE AT ADONI
O.S No. 295 OF 2022

BETWEEN:
Mr E Shankarappa Goud S/o. E Allaiah. ...Plaintiff
AND
Mr R Linganna S/o. R Naganna. ...Defendant

SUMMONS

To
Mr R Linganna S/o. R Naganna,
aged about 50 years, Hindu, Land lord,
resident of Mulugundam Village -518347,
Aspari Mandal, Kurnool District,
A.P. Cell No. 6301380581.

Whereas the Plaintiff has instituted as suit against you for Recovery of Amount, You are hereby summoned to appear before this Hon'ble Court in person or by a pleader on the 07th day of December 2023 at 10-30 O' clock in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of service of this summon a written statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense.

Advocate for the Plaintiff
(A.Md Parvez Kamal Sanan)

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE :: ADONI.
E.P.132/2018 IN O.S.241/2017

Between:
C. Uligappa. ...Decree-holder
.VS.
U.Chandrasekhar. ...Judgement-debtor

SALE

Whereas the Decree-holder in the above E.P. has brought undivided share of the J.Dr. in the E.P. schedule property for sale and the above E.P. is posted to 17-11-2023 for sale of the E.P. schedule property. The intending bidders may come and participate in bid in the auction, which will be held on 17-11-2023 between 10.30 a.m. to 5 P.m. before the hon'ble court.

Schedule

Landed property situated within R.D. of Kurnool, S.R.D. of Adoni, in Madire village, with the following particulars:
Survey no.463-A paiki Ac.1.00
[undivided share of J.Dr.]

Boundaries:
Eastland of D. Hanumanthu
Westland of Narasimhappa in the same survey number and remaining land of Narasimhulu
Northland of Devarinti Yenkanna
Southland of D. Hanumanthu
D.Hr. value Rs.2 lakhs -
Amin value Rs.6 lakhs
Market vale 2.50.000/-

K. ABDUL RASHEED,
D. SAVITHA RANI,
ADVOCATES FOR D.HR. ADONI.

ఉద్యోగం, ఉపాధి కోసం ఉద్యమం

- డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శ్రీకృష్ణ, మండల కార్యదర్శి ఉచ్చీరప్ప కోరారు. డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదోని మండలం పాండవగల్లు గ్రామంలో డివైఎఫ్ఐ జెండాను డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువతకు ఉపాధి కావాలంటూ అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు జె.రామాంజనేయులు, డివైఎఫ్ఐ మండల నాయకులు హుసేని, రమేష్, పి.రామాంజనేయులు, డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు వీరాంజనేయులు, వీరేష్ పాల్గొన్నారు.

5న ఉచిత కంటి ఆపరేషన్లు

- ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు నగేష్ కాకుబాళ్

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న జరిగే ఉచిత కంటి అపరేషన్లను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం మాజీ అధ్యక్షులు నగేష్ కాకుబాళ్ కోరారు. గురువారం ఆదోనిలో కరప్రతాలను విడుదల చేశారు. శాంతిరామ్ హస్పిటల్, ఆరోగ్యశ్రీ సౌజన్యంతో ఈనెల 5 భార్ పేట పోస్ట్ ఆఫీస్ దగ్గర, ఉర్దూ ఘర్‌లో ఉచిత కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. ఉచితంగా కంటి ఆపరేషన్లతోపాటు ఆస్పత్రిలో వసతి, భోజనాలు, ఆదోని నుంచి నంద్యాల హస్పిటల్‌కు బస్సు సౌకర్యం కూడా ఉచితంగా కల్పిస్తున్నట్లు చెప్పారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు గతంలో కూడా వందల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. సంతానం లేని వారికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మిర్యాల బద్రినాథ్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.

నేడు దేవనకొండలో స్పందన

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో 'జగనన్నకు చెబుదాం, స్పందన' నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వెంకటేష్ నాయక్ గురువారం తెలిపారు. స్పందనను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదోని కరువు మండలమే...

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని కరువు మండలమేనని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. గురువారం మండలంలోని మదిరే గ్రామంలో రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఆదోని మండలాన్ని కరువుగా ప్రకటించారని తెలిపారు. కొందరు వాస్తవాలను కప్పిపుస్తూ కరువు మండలం కాదని, ఏదో వారి పేరు కోసం తాపత్రయం తప్ప నిజాలను తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఎఒ అశోక్ కుమార్ రెడ్డి, సర్పంచి నారాయణ, ఎంపిటిసి మహాదేవమ్మ, పిఆర్ డిఇ ఖాదర్ బాష, ఎఇ మాలిక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని మదిరే గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయకుండా టిడిపి మోసం చేస్తే, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి వైసిపి ప్రజావిశ్వాసాన్ని పొందిందని తెలిపారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కింద ప్రతి గ్రామ సచివాలయానికీ రూ.20 లక్షలు అభివృద్ధి పనులకు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపిడిఒ గీతావాణి, సర్పంచి నారాయణ, నాగ మల్లయ్య, హౌసింగ్ బోర్డు అధికారి తిక్కన్న, ఎంపిటిసి మహదేవమ్మ, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, పిఆర్ డిఇ ఖాదర్ బాష, ఎఇ మాలిక్, ఎపిఒ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, లక్ష్మీ కాంత్ రెడ్డి, గిడ్డయ్య, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

కాలువలో దిగి ధర్నా చేపడుతున్న రైతులు

పంటలు ఎండుతున్నాయి...

- ఎల్ఎల్‌సి కాలువలో రైతుల ధర్నా

ప్రజాశక్తి -పెద్దకడబూరు

పంటలు ఎండుతున్నాయని, కాలువకు నీరు వదలాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కల్లుకుంట గ్రామ రైతులు ఎల్ఎల్‌సి కాలువలో దిగి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ భూములు తడిపిన తర్వాతే సాగునీటిని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఒకవైపు వర్షాల్లేవని, మరోవైపు పంటలు ఎండుతున్నాయని వాపోయారు. పంటలకు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టామని, అధికారులు కనికరం చూపకుండా సాగునీటిని వదలబోమని చెప్పేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి వ్యవహారంపై కల్లుకుంట రైతులందరూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డిని కలవాలని ఎమ్మెల్యే తెలిపినట్లు సమాచారం.

రావూస్‌లో 'ఆఫ్ క్యాంపస్'

- 21మంది నిరుద్యోగులు ఎంపిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో గురువారం ఆఫ్ క్యాంపస్ నియామకాలు చేపట్టారు. పరిసర ప్రాంతాల నిరుద్యోగులందరికీ ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో హెట్రో డ్రగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ వారి చేత ఆఫ్ క్యాంపస్ నియామకాలు చేపట్టినట్లు రావూస్ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి తెలిపారు. ఈ నియామకాల్లో సుమారు 87 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారని, హెట్రో డ్రగ్స్ కంపెనీకి 21 మంది ఎంపిక కావడం సంతోషంగా ఉందని చెప్పారు. అనంతరం హెట్రో డ్రగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్‌లను రావూస్ కళాశాల యాజమాన్యం సన్మానించింది. రావూస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ ఇర్ఫాన్, నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు

లీకేజీ పైపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలోని పలు వీధుల్లో పురాతన కాలంలో వేసిన పైపులు లీకేజీ అవుతుండడంతో సర్పంచి దాసరి గోవింద రాజులు గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది చేత మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిప్పగిరిలో చాలా ఏళ్ల క్రితం వేసిన పైపులకు రంధ్రాలు పడి తాగునీరు వృథా అవుతోందని తెలిపారు. పైపుల ద్వారా నీరు ముందుకు పోవడానికి ఇబ్బందిగా ఉండేదని చెప్పారు. వెంటనే పంచాయతీ నిధుల ద్వారా శాశ్వత పరిష్కారం చూపేందుకు కొత్త పైపులను వేయించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచి

ఆదోని కరువు మండలం ప్రకటనపై

ఎమ్మెల్యే చొరవ చూపాలి : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

కరువు కాటకాలకు, వలసలకు చిరునామాగా మారిన ఆదోనిని కరువు మండలంగా ప్రకటించడంపై ఎమ్మెల్యే చొరవ చూపాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని మండగిరిలో ఉన్న ఆమె నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదోని మండలాన్ని కరువుగా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ప్రతేడాది ఆదోనిపై ఎందుకంతా నిర్లక్ష్యమని ప్రశ్నించారు. వర్షాల్లేక మండలంలో కరువు విలయతాండవం చేస్తోందన్నారు. ఆదోని సబ్ కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధి మేల్కొని ఆదోనిని తీవ్రమైన కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు వడ్డేమాన్ గోపాల్, మురళి, రాఘవరెడ్డి, సాధిక్ వలీ, బాబురావు, లక్ష్మీకాంత్ రెడ్డి, భరత్ కుమార్, చిరంజీవి ఉన్నారు.

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - నందవరం

కులం పేరుతో దూషించి, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాల నరసప్ప కోరారు. గురువారం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మాల శేఖర్‌ను నరసప్ప, జిల్లా అధ్యక్షులు మధుబాబులు పరామర్శించారు. శేఖర్‌కు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ బజ్జన్న, ఆయన కుమారులు బోయ నరసింహులు, బోయ ఉరుకుందు, బోయ రామాంజనేయులు కలిసి గ్రామ చావిడి దగ్గర శేఖర్‌పై దాడి చేశారని చెప్పారు. పొలం పంచాయితీ ఉందని పిలిపించి గ్రామస్తులు చూస్తుండగా కులం పేరుతో దూషించి ఇనుప చువ్వతో తలపై గుచ్చి, రాళ్లతో దాడి చేశారని తెలిపారు. స్పృహ కోల్పోయిన మాల శేఖర్‌ను కుటుంబ సభ్యుల సహకారంతో చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారని చెప్పారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాల రాగప్ప, మాల రవి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి చర్యలు : వైసిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణాభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం 7, 9వ వార్డుల్లో రూ.21 లక్షల వ్యయంతో సిసి రోడ్డు, అభివృద్ధి పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సహకారంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, కమిషనర్ గంగిరెడ్డి, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ రాజశేఖర్, కౌన్సిలర్ రాజారత్నం, వైసిపి నాయకులు రియాజ్ అహ్మద్, బుట్టా రంగయ్య, గట్టు ఖాజా, రజాక్ పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ'తో సంక్షేమ పథకాలు

- తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి

మంత్రాలయం : 'బాబు ష్యూరిటీ'తో సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి తెలిపారు. గురువారం రాఘవేంద్ర నగర్ కాలనీలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోలో సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలుగు యువత జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయన, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, ఎంపిటిసి నక్కి వెంకటేష్, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు, వనికె నాగరాజు, మేకల నరసింహులు, చిదానంద పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారి కోర్టులో
Tr. O.P. No. 8/2023

శ్రీమతి కె.అరుణ. ...అర్జీదారు

-వర్సెస్-

1.బి.వెంకటసుబ్బారెడ్డి
2.శ్రీమతి యస్.ఈరమ్మ
3.యస్.అంజనేయులు
4.కె.లక్ష్మిదేవి
5.రాజపుత్ర సత్యనారాయణసింగ్
6.షేక్ ఖలీల్ అన్‌సారీ
7.జాఫర్ రహీమ్. ...రెస్పాండెంట్లు

2,5,6 రెస్పాండెంట్లకు నోటీసులు

2.శ్రీమతి యస్.ఈరమ్మ భర్త లేటు నారాయణస్వామి, ఇంటి.నెం.1-541-123,రాఘవేంద్రనగర్,ఆదోని, కర్నూలు జిల్లా.
5.రాజపుత్ర సత్యనారాయణసింగ్ తండ్రి లేటు నరసింగబాను, కూల్‌డ్రింక్ కీపర్,శ్రీవెంకటేశ్వర స్వీట్ స్టాల్, మున్సిపల్ కాంప్లెక్స్ రోడ్డు, ఆదోని, కర్నూలు జిల్లా.
6.షేక్ ఖలీల్ అన్‌సారీ తండ్రి లేటు యం.డి.ఇబ్రహీం,కె.యం.కలర్ వరల్డ్, ఐశ్వర్యలాడ్జ్ ఎదురుగా, సిండికేట్ బ్యాంక్, ఆదోని, కర్నూలు జిల్లా.

పై నెంబరులోని అర్జీదారు రెస్పాండెంట్లు అయిన మీపైన ఆదోని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓ.యస్.నెం.245/2019 సివిల్ దావాను దాఖలు చేసియున్నారు. ఈ దావాలో 1,2,3,4 రెస్పాండెంట్లు /1,2,3,4 ప్రతివాదులుగా ఉన్నారు. అలాగే 4వ రెస్పాండెంటు అయిన కె.లక్ష్మిదేవి ఆదోని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓ.యస్.నెం.234/2019 అర్జీదారుపైన మరియు 5,6,7 రెస్పాండెంట్లపైన ప్రతివాదులుగా చూపిస్తూ సివిల్ దావాను దాఖలు చేసియున్నారు. ఈ రెండు దావాలు ఒకే సర్వే నెంబరు మరియు ప్రాపర్టీ షెడ్యూలు ఒకటే ఉన్నందున రెండు దావాలు ఎందో ఒక న్యాయస్థానంలో విచారణ జరపాలని అర్జీదారు పై తెలిపిన కోర్టులో అర్జీదాఖలు చేసి యున్నారు. ఇందులో 2,5,6 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 09-11-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 09-11-2023

జి.నారాయణస్వామి,
జి.యస్.ప్రకాష్‌రెడ్డి,
అర్జీదారు పరం అడ్వకేట్లు, కర్నూలు.

అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్

కన్నీరు మిగిల్చిన ఖరీఫ్

- భారీగా తగ్గిన దిగుబడులు
- అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాతలు
- కొత్తపల్లి మండలంలో నెల రోజుల్లోనే ముగ్గురు ఆత్మహత్య
- కరువు మండలాల జాబితాలో దక్కని స్థానం

కొత్తపల్లి మండలంలోని రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు కన్నీరు మిగిల్చింది. పంటల దిగు బడి భారీగా తగ్గిపోవడంతో అన్నదాతలు ఆందోళనలో పడిపోయారు. పంటల సాగు కోసం పెట్టిన పెట్టు బడులు కూడా రాకపోవడంతో రైతులు అప్పుల్లో కూరు కుపోయారు. మండలంలోని నంది కుంట గ్రామంలో ఈ ఏడాది నెల రోజుల వ్యవధిలో ముగ్గురు రైతులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకోవడం బాధా కరం. విత్తనాలు వేసిన నాటి నుంచి పడాల్సిన వర్షాల కన్నా తక్కువగా కురవడం, మరికొన్ని చోట్ల విత్తనాలు మొలకెత్తిన సమయంలో భారీ వర్షం కురవడంతో పంటలు పూర్తిగా చనిపోయాయి. దీంతో రైతులు పంటలన్నీ పూర్తిగా చెడగొడుతూ అరకొరగా ఉన్న పంటలు కూడా సరిగ్గా రాక ఖరీఫ్ సీజన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కనీసం కరువు మండలంగా అయి నా ప్రకటించి ఆదుకుంటుందన్న ప్రభుత్వం మొండి చేయి చూపడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలో 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురుస్తాయని ఆశతో రైతులు 22,737 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. మొక్కజొన్న 15,950 ఎకరాలు, పత్తి 2,465, వరి 280, మిరప 267, మునగ 197, సోయా చిక్కుడు 240, కందులు 380, మినుములు 206, ఉల్లి 160, పొగాకు 57, పెసులు 16 ఎకరాలలో పంటలను సాగు చేశారు. వర్షపాతం గత ఏడాదితో పోలిస్తే ఈసారి చాలా తక్కువగా నమోదయింది. జూన్ 84 మి.మీకు గాను 21.6, జులై 179 మి.మీకు గాను 287.3 మి.మీ, ఆగస్టు 166 మి.మీకు గాను 33.3, సెప్టెంబర్ 148 మి.మీకు గాను 205.8 మి.మీ వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలకు సరైన వర్షం లేక తూతూమంత్రంగా దిగుబడి వచ్చింది. మొక్కజొన్నకు ఎకరాకు రూ. 15 వేల నుంచి 20 వేలు, పత్తికి ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల దాకా పెట్టుబడి పెట్టారు. మిరపకు మాత్రం ఎకరాకు రూ. 1 లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. మిరపకు వచ్చిన తెగులతో పూర్తిగా నట్టేట మునిగి పంటలన్ని పూర్తిగా చెడగొట్టి మళ్లీ మిరపనార నాటారు. దీంతో రైతులు పంటల సాగు అప్పు మీద అప్పు చేయాల్సి వచ్చింది. మొక్కజొన్న దిగుబడి ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లుమాత్రమే దిగుబడి వచ్చింది. ఈ ఏడాది రైతులు వేసిన పంటలన్నీ అరకొరగా మాత్రమే దిగుబడులు వచ్చాయి.

ప్రభుత్వం కొత్తపల్లిని కరువు మండలంగా ప్రకటించి కరువు సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నెల రోజుల వ్యవధిలో ముగ్గురు రైతులు ఆత్మహత్య

ఈ ఏడాది నెల రోజుల వ్యవధిలో కొత్తపల్లి మండలం ఒక్క నందికుంట గ్రామంలోనే ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. సెప్టెంబర్‌లో రైతులు వంగాల సుబ్బారెడ్డి, మైల సుధాకర్, అక్టోబర్‌లో రైతు అబ్దుల్ రజాక్ పంటల దిగుబడి లేక, సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. మండలంలో ఈ మూడేళ్ల కాలంలో సుమారు 10 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

మిరప సాగు కోసం రూ. 6 లక్షల వరకు అప్పు చేశా

- మిరప రైతు గౌరు రామ సుబ్బారెడ్డి, ఎర్రమఠం గ్రామం.

ఈ ఏడాది కురిసిన వర్షాలకు 8 ఎకరాల పొలంలో మిరప పంట సాగు చేశాను. సుమారు 6 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. అయితే ఈ ఏడాది మిరప పంటకు తెగుళ్లు విపరీతంగా రావడంతో మొక్క పెరుగుదల రాలేదు. దీంతో మిరప పంట 4 ఎకరాల వరకు చెడగొట్టి మళ్లీ మిరప సాగు చేశాను. అయినప్పటికీ పెరుగుదల, కాపు సరిగ్గా రాలేదు. దీంతో పంట కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి నష్టపోయిన రైతులను కరువు సహాయం చేసి ఆదుకోవాలి.

కరువు మండలాలు ప్రకటించడంలో నిర్లక్ష్యం

- ఎ.రాజశేఖర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం కరువు మండలాలు తూతూ మంత్రంగా ప్రకటించి చేతులు దులుపుకోవడం సరైంది కాదు. జిల్లాలో కొత్తపల్లి, పాములపాడు, ఆత్మకూరుతో పాటు మరికొన్ని మండలాలను కరువుగా ప్రకటించాలి. కొత్తపల్లి మండలంలో సరైన సమయంలో వర్షాలు పడక, అవసరం లేని సమయంలో వర్షాలు కురవడంతో రైతులు రెండు రకాలుగా నష్టపోయారు. మండలంలో ఏ పంట చూసినా సరైన దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. కొత్తపల్లి మండలంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయి. కరువు మండలాల జాబితాలో కొత్తపల్లి లేకపోవడం బాధాకరం. జిల్లాలో వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు స్పందించి నష్ట పోయిన మండలాలన్నీ కరువుగా ప్రకటి ంచాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులను సమీకరించి రాస్తారోకోలు, ధర్నాలు చేపడతాం.

చెరువు టూరిస్ట్ రెస్టారెంట్ వారంలో ప్రారంభించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చిన్న చెరువు టూరిస్ట్ రెస్టారెంట్‌ను వారం రోజుల్లో ప్రారంభించే ందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ ఆదేశించారు. చిన్న చెరువు గట్టుపై టూరిస్ట్ రెస్టారెంట్‌లో వేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ గురువారం పరిశీలిం చారు. స్థానిక చిన్న చెరువు గట్టుపై టూరిస్ట్ రెస్టారెంట్ పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వేగంగా జరుగు తున్న అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించి గ్రీన్ కో అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. నంద్యాల పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చే రీతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తిచేసి వారం రోజుల్లో ప్రారంభించే ందుకు చర్యలు తీసుకోవాలని టూరిజం అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న అరకొర పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రీన్ కో ప్రతినిధులను సూచించారు. రెస్టారెంట్ బిల్డింగ్ పునర్నిర్మాణ పనులు, చిన్నపిల్లల ఆట వస్తువులకు సంబంధించిన పరికరాలు, అవుట్డోర్ జిమ్, ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ ప్రమాద నివారణ నిమిత్తం ఏర్పాటు చేసే ఐరన్ రక్షణ ఫెన్సింగ్, ఫుడ్ కౌంటర్ తదితర పనులను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఖాళీ ప్రదేశాల్లో ఆకర్షించే రీతిలో గ్రీనరీ చేపట్టాలని సూచించారు. చెరువులో బోటింగ్ చేసేందుకు వీలుగా అందుబాటులో ఉంచిన మోటార్ బోట్లు, ఫెడల్ బోట్లను కలెక్టర్ పరిశీలించారు.

ఒక తడి నీళ్లు ఇవ్వండి

ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డిని కలిసిన రైతులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఒకతడి నీళ్లు ఇచ్చి పంటలను ఆదుకోవాలని నంద్యాల, గోస్పాడు మండలాలలోని రైతులు నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తిరుమలేశ్వర్ రెడ్డిని కోరారు. నీళ్లు రాక పోవడంతో పంటలు ఎండిపోతు న్నాయని ఒక్క తడి నీళ్లు ఇచ్చి ఆడుకోవాలని గురువారం నంద్యాల ఇరిగేషన్ కార్యాలయానికి రైతులు చేరుకొని ఈఈని కలిసి తమ బాధను వెళ్లబుచ్చారు. పాండురంగాపురం వరకే నీళ్లు వస్తున్నాయని తెల్లపూరి, మిట్నాల, గుంతనాల, తోగిడిసెడు చుట్టూ ప్రక్కల గ్రామాల పరిధిలో దాదాపు 3 వేల ఎకరాల లో మిరప శనగ జొన్న మినుములు పత్తి తదితర పంటలు సాగులో ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. ఒక్క తడి ఇవ్వకపోతే పంటలు ఎండిపోతాయని కాబట్టి ఒకసారికి సాగునీరు వచ్చి పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలని రైతులు కోరారు. అందుకు స్పందించిన ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డి ఒకతడి నీరు ఇస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరము రైతులు ఎమ్మెల్యేని కలిసి సమస్యను వివరించారు.

నందికొట్కూర్, జూపాడు బంగ్లాను కరువు మండలాలుగా ప్రకటించాలి : సిపిఎం

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మెట్ట ప్రాంతమైన నందికొట్కూర్, జూపాడుబంగ్లాను కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని భరత్ కాంప్లెక్స్‌లో సిపిఎం కార్యకర్తల సమావేశం పకీరు సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల్లో వేలాది ఎకరాలలో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయిన సంఘటనలు మండల, జిల్లా స్థాయి అధికారులకు కనిపించ లేదా అని ప్రశ్నించారు. పంటలు ఎండిపోయి పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వేసిన పంటలు మొత్తం దున్నేశారని అధికారులు నివేదిక పంపకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నందికొట్కూరు నియోజకవర్గం లోని అన్ని మండలాలను కరువుగా ప్రకటించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి నిరవధిక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, నాయకులు టి.గోపాలకృష్ణ, ఎం కర్ణ, రాము, శివ, వి.ఆంజనేయులు, వేణుగోపాల్, రామిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల గుంతలు పూడ్చలేని ప్రభుత్వం

- మూడు రాజధానులను ఎలా నిర్మిస్తారు..? : సిపిఎం

ప్రజాశక్తి - మిడుతూరు

రోడ్డు గుంతలు పూడ్చలేని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మూడు రాజధానులు నిర్మిస్తానని చెప్పడం ప్రజల్ని మోసం చేయడం తప్ప మరోటి కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు విమర్శించారు. నందికొట్కూరు నుండి నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు మార్గాన్నిసిపిఎం ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిడ్తూర్ నుండి చెరుకుచెర్ల, మంచాలకట్ట నుండి గడివేముల వరకు రోడ్డు మోకాటి లోతు గుంతలు పడ్డాయని చెప్పారు. నంద్యాలను జిల్లా ఏర్పాటు చేయడం తప్ప నందికొట్కూరు నుండి నంద్యాలకి వెళ్లాలంటే 70 కిలోమీటర్లు, 100 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని, రోడ్డు అధ్వాన స్థితిలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుంతలు పూడ్చి రోడ్డు ఏర్పాటు చేసే దిక్కులేదని, అలుగునూర్ రిజర్వాయర్‌కు గండి పడి మూడు సంవత్సరాలు అవుతున్న పూడ్చే దిక్కులేదని, కానీ మూడు రాజధానులు నిర్మిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెంటనే నందికొట్కూరు–నంద్యాల రహదారిని డబల్ రోడ్డుగా ఏర్పాటు చేయాలని, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.భాస్కర్ రెడ్డి, పి.పకీర్ సాహెబ్, టి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల గుంతలను పరిశీలిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న జె. లక్ష్మి నరసింహ

రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మీ నరసింహ యాదవ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం రాయలసీమ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, నంద్యాల జిల్లాలో కేవలం 5 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు జె. లక్ష్మి నరసింహ పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులకు నష్ట పరిహారం లక్ష రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించి, ఆ కుటుంబంలో ఒకరి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తూంటే జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే మిగిలిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. విద్యుత్ కోతలు నివారించి, ఉపాధి పనులను ప్రారంభించాలన్నారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, కొత్త వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్మీ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమము లో నంద్యాల పట్టణ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు,డిసిసి వైస్ ప్రెసిడెంట్ బాలస్వామి,రాష్ట్ర స్పోకెస్ పర్సన్ వాసు,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు నాగలింగం నియోజక వర్గం కోఆర్డినేషన్ సభ్యులు సాంబశివుడు నంద్యాల పట్టణ ఉపాధ్యక్షులు ఆనంద్ రావు, జిల్లా కార్యదర్శి రఫీ మనపాటి శ్రీనివాస్ గౌడ్, మధు, ఆదం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

- మున్సిపల్ చైర్మన్ నివాళి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని పగిడ్యాల రోడ్ బైరెడ్డి నగర్‌లో నివాసముంటున్న డి.స్వాములు తండ్రి దామగట్ల పుల్లయ్య(70) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి నివాళ్లులర్పించారు. చైర్మన్‌తో పాటు శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్, కౌన్సిలర్ అల్లూరి క్రిష్ణ, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ హిదాయతుల్లా (లడ్డూ) తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం పేదవాడి ఆరోగ్యంపై చిత్త శుద్ధితో పనిచేస్తోందని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో రూ.1కోటి 25 లక్షలతో అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్లో స్థానిక కౌన్సిలర్ తూర్పునాటి సావిత్రమ్మ, వార్డు ఇంచార్జ్ రమణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరై రోగులకు పరీక్షల అవసరమైన వారికి ఉచితంగా మందులను, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, వైసిపి నాయకులు, సాయిరాం రెడ్డి, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె:** జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్ష అని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు సచివాలయం 2లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైసిపి వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, ఎంపీడీవో శివరామయ్య ప్రారంభిం చారు. వైద్య శిబిరంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు మహమ్మద్, ప్రసూతి నిపుణులు కళ్యాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ సోహెల్, డాక్టర్ కావ్య, కంటివైద్య నిపుణులు వెంకటేశ్వర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన 10 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కాత వెంకటసుబ్బారెడ్డి, రాఘవయ్య, కాటసాని పుల్లారెడ్డి, ఈఓఆర్డి గురు ప్రసాద్, ఈ వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని కనకాద్రిపల్లె పంచాయతీ కనకాద్రిపల్లెలోని ప్రాథమిక పాఠశాల నందు జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, నందిపాడు సర్పంచ్ గురువిరెడ్డి, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర్ రెడ్డి, సర్పంచ్ శివశంకర్, టిసి వెంకట రాముడు, ఎంపీడీవో జీవి ప్రసాద్ రెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలం దరూ అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు:** పేద ప్రజల ఆరోగ్యమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డులో ఇంద్రానగర్ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమన్నారు. ఇతర రాష్ట్ర ప్రజా ప్రతినిధులు మన రాష్ట్ర పథకాలను ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా, జడ్పిటిసి శంకర్ రెడ్డి, వైసిపి మండల, టౌన్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల ప్రజా ప్రతినిధులు, వార్డు, నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే గంగుల నాని

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈనెల 7న ఆళ్లగడ్డలో జరిగే సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆళ్ళగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. గురువారం చాగలమర్రి పట్టణంలోని కూలూరు రస్తాలో గల జగనన్న లేఔట్లలో మహబూబ్ బాషా అలియాస్ భారీక్ ఛామల్ నూతనంగా నిర్మించిన గృహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చాగలమరి పట్టణ వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గం లో కేసీ కాలువ 16వ బ్లాక్ నుండి 27వ బ్లాక్ వరకు రైతులు అధిక సంఖ్యలో పంటలు సాగు చేశారన్నారు. పంటలను సాగుచేసిన రైతులను ఆదుకునేందుకు వారబంది ప్రకారము నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు కరువు మండ లాలుగా ప్రకటించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జే సి ఎస్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు ముల్లా రఫీ,జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబీర్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైల మండలం లింగాల గట్టు, పాతాళగంగ ప్రాంతంలోని కృష్ణవేణి మత్స్యకారుల సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శ్రీశైల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి నాయకత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సున్నిపెంటలోని శిరిడి సాయిబాబా ఆలయం ప్రాంగణంలో నూతన కార్యవర్గాన్ని వైసిపి నాయకులు వట్టి వెంకటరెడ్డి అధ్యక్షతన నాయకులు భరత్ రెడ్డి, గుండయ్య యాదవ్, చెల్లూరి మల్లికార్జున, కొండబాబు, ఎం.కోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనిగ చెన్నయ్య, సోమేశు, ఆటో మల్లికార్జున, దానియేలు, ప్రభాకర్, తొండం వెంకటేశ్వర్లు, బద్రునాయక్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి ఘనంగా సత్కరిస్తున్న స్థానిక వైసీపీ నాయకులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ గోపికృష్ణ, చిత్రంలో ఎస్ఐ

ప్రధాన రహదారిని ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - పాములపాడు

కర్నూల్ నుండి అమరావతికి వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న షాపులు, పాములపాడు బస్టాండ్ కేంద్రంలో దుకాణాలు, హోటల్స్ వారు తమకున్న స్థలం వరకు మాత్రమే నిర్వహించుకోవాలని, అక్రమణ చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గోపికష్ణ, ఎస్సై జి.అశోక్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రధాన రహదారి వెంట ఉన్న దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారిని ఆక్రమించి ముందుకు రేకుల షెడ్లు వేసినా, రోడ్డును ఆక్రమించినా, ట్రాఫిక్ అంతరాయం కలిగించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆర్అండ్‌బి వారితో కలిసి ప్రధాన రహదారి వెంట ఆక్రమించిన వాటిని మార్కింగ్ వేస్తామని, ముందుకు రేకుల షెడ్లు వేసిన వారు నెల రోజుల వ్యవధిలో స్వచ్ఛందంగా తీసివేసుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజు, పోలీస్ వారి సమక్షంలో తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, దుకాణదారులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని బొల్లవరం గ్రామానికి చెందిన పాములేటి అనే వ్యక్తి వద్ద నుండి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ గురువారం పేర్కొన్నారు. సారా అమ్మిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్సై తెలిపారు

అన్నప్రసాద వితరణకు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానంలోని అన్నప్రసాద వితరణకు గురువారం బాపట్లకు చెందిన ఎం.వెకంటేశ్వర్లు రూ.1,00,800లు విరాళంగా అందజేశారు. వితరణ పర్యవేక్షకులు సి.మధుసూదన్‌రెడ్డికి నగదును అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ప్యాపిలి

ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షా ఫలితాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీవో ఫజల్ రెహమాన్ పేర్కొన్నారు. గురువారం ప్యాపిలిలోని బాలికల ఉన్నత పాఠశాలలో రేపు జరగబోయే స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్మెంట్ సర్వేపై ఉపాధ్యాయులకు, ఇన్విజిలేటర్లకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాపిలి మండలం సీస్ పరీక్షలకు 39 పాఠశాలలు ఎంపికయ్యాయని, ఈ పరీక్ష 3,6,9 తరగతులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవడానికి ప్రభుత్వం సీస్ ఎగ్జామ్స్ పెడుతున్నట్లు చెప్పారు. హెచ్ఎంలు, ఇన్విజిలేటర్లు అందరూ పరీక్షను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేష్ నాయక్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ : టిడిపి

కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాండ్ర శివానంద రెడ్డి చిత్రంలో నాయకులు

ప్రజాశక్తి - పాములపాడు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. గురువారం పాములపాడులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోను తప్పకుండా అమలుపరుస్తుందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.18 వేలు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం అందిస్తామన్నారు. టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జయసూర్య, మండల అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మండల నాయకులు బండ్లమూరి వెంకటేశ్వరరావు, హరినాథ్ రెడ్డి, తిమ్మారెడ్డి గోవిందు, మధు కృష్ణ, శివ శంకర్ రెడ్డి, సాములు, లింగాల సర్పంచ్ బాల మల్లేశ్వర్ రెడ్డి, రాము చౌదరి, జనార్దన్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, ఎన్.కృష్ణయ్య, జనార్ధన్, శివశంకర స్వామి, నాగలక్ష్మి రెడ్డి, ప్రసాదు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు : రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని 12, 27వ వార్డులలో టిడిపి రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో చెప్పిన విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది చదువుకున్న విద్యార్థులు ఉన్నా అందరికీ ఏడాదికి రూ.15000, అన్నదాతకు పథకం కింద రూ.20,000 అమలు చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, ముత్తు జావలి, బి. జనార్ధన్, సౌదీ చాంద్ భాష, శాంతరాజు, సయ్యద్ అహ్మద్, రషీద్ ఖాన్, నిమ్మకాయల మోహన్, రాజు, బొల్లెద్దుల రాజన్న, కళాకర్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె:** వైసిపి రాక్షస పాలనకు చమరగీతం పాడలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పసుపల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీకి టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, టిడిపి నాయకులు బాల నాయుడు, షేక్షావలి, కామేష్, మధుసూదన్ నాయుడు, మురళిల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం బిసి జనార్ధన్ రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్ లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసారని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణానాయక్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, నాయకులు చిన్న రాజుపాలెం నరసింహ, రామాంజనేయులు, పాతపాడు సంకేశ్వర రెడ్డి, పెద్దరాజుపాలెం బాలకృష్ణ శంకర్ నాయక్, కృష్ణా నాయక్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న బిసి జనార్ధన్ రెడ్డి

అర్హుల వద్దకే పథకాలు : ఎమ్మెల్యే

సంక్షేమ పథకాల బుక్ లెట్ ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - అవుకు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గ్రామ, వార్డు సచివాలయాలతో అర్హులవద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం అవుకు పట్టణంలోని సచివాలయం రెండు పరిధిలోని వార్డులలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైసిపి యువ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డిలతో కలిసి ప్రజలకు సంక్షేమ పథకాల బుక్లెట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవుకు పట్టణంలోని ప్రజల అభిమానం మరువలేనిదన్నారు. రాబోవు ఎన్నికల్లో మరొకసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా చేయాలని తెలిపారు. అనంతరం ఆయన అవుకు పట్టణంలోని మార్కెట్ వీధి నుండి సెంటర్ వరకు 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ మంద గురమ్మ, ఉప సర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, చల్ల విక్రాంత్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి ముడియం చంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు రామన్న, రాఘవరెడ్డి, బత్తిన మద్దిలేటి గౌడ్,పండ్ల వాయినం దన గౌడ్,చౌడయ్య, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చాగలమర్రి : గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతలచెరువు,కొలుములపేట గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఎంపీపీ వీరభద్రుడు, ఎంపిటీసీ రాజేశ్వరి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,వైసిపి నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, వైసీపీ నాయకులు వెంకటేశ్వర రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,డీలర్ నరసింహా రెడ్డి,గణపతి రెడ్డి,రామగురివిరెడ్డి,మండల జేసిఎస్ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంగులకు జ్ఞాపికను అందిస్తున్న సూపరిండెంట్ సుజాత

ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని
కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే గంగుల తమ మిత్రుడు మనోహర్ సహకారంతో దాదాపు 12 లక్షల రూపాయలతో హాస్పిటల్‌కి కావాల్సిన ఎక్విప్మెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే తన ముందు న్న లక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం ఆసుపత్రికి ఎక్విప్మెంట్ అందజేసిన ఎమ్మెల్యే గంగుల మిత్రుడు మనోహర్ ను, ఎమ్మెల్యే గంగుల బావ సిద్ధార్ద్ రెడ్డిని, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాత, ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపీడీవో మహబూబ్ ఖాన్, దామోదర్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

ప్రజల సౌకర్యార్థం కోసం వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసినట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ ఏర్పాటును సప్తశైల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మంత్రి బుగ్గన ఆదేశాలతో యువతీ యువకుల కోసం మున్సిపల్ ఆఫీస్ పరిసర ప్రాంతంలో జిమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు వాకింగ్ ట్రాక్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఈ రసూల్,ఏఈ సురేష్,మున్సిపల్ వైస్ చైర్మన్లు హరికిషన్, జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు మృతి
- సంతాపం తెలిపిన భూమా

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు కొత్తపల్లె అంకాళ్ (70) అనారోగ్యంతో గురు వారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆళ్ళగడ్డ నియోజకవర్గ తెలుగు యువత నాయకులు భూమా విఖ్యాత్ రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిడిపి నాయకులు ఇండ్ల లక్ష్మిరెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి,హుసేన్ రెడ్డి,కేశవ రెడ్డి తదితరులు ఉన్నారు.

యువత స్వయం
ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి : సిఐ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నిరుద్యోగ యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల పైనే ఆధారపడకుండా స్వయం ఉపాధి మార్గాలనూ ఎంచుకోవాలని పట్టణ సిఐ రమేష్ బాబు, ప్రముఖ పారిశ్రామికవేత్త టిఎంసి వేణుగోపాల్ సూచించారు. గురువారం పట్టణంలోని కందుకూరు రోడ్డులో ఇద్దరు పాత్రికేయులు ఏర్పాటుచేసిన టీ, స్నాక్స్ పాయింట్‌ను ఆళ్లగడ్డ టౌన్ సిఐ రమేష్ బాబు, పారిశ్రామిక వేత్త వేణుగోపాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య నివారణకు చిన్న చిన్న వ్యాపారాలు సైతం ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి పూజలో వారు పాల్గొన్నారు. అనంతరం టీ పాయింట్ నిర్వాహకులు నాగ సుధాకర్ , మద్దిలేటి లు సిఐ రమేష్ బాబు, పారిశ్రామికవేత్త వేణుగోపాల్‌ను శాలువాలతో సత్కరించారు.

షాప్‌ను ప్రారంభిస్తున్న సిఐ

పోరాటాల వల్లే కరువు మండలంగా బేతంచర్ల
- ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - బేతంచర్ల

రైతులు, వ్యవసాయ కూలీలను, కార్మికులను కలుపుకొని బేతంచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని అనేక ఆందోళలను, పోరాటల ఫలితంగా బేతంచెర్ల కరువు మండలంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని ఏపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్. ఈశ్వరయ్య, రైతు సంఘం గౌరవ అధ్యక్షులు నీలి వెంకట కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు సీతారామాపురం జి. వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పి. రామ మోహన్, ఉపాధ్యక్షులు కిలారి రామతిమ్మారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రజాసంఘాలు, వామపక్షాల మద్దతు ప్రోద్బలంతో చేసిన పోరాటల ఫలితంగా మండల స్థాయి అధికారులు కదలి వర్షపాతం నమోదును పరిశీలించి, ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగిందన్నారు. అయితే ఇది తాత్కాలికమని, హంద్రీ నీవా సుజల స్రవంతి నీటిని కాలువ నుండి ఎత్తిపోతల ద్వాం, గూటుపల్లె చెరువును నింపితే 10 గ్రామాల రైతుల పొలాల్లో వేసిన బోరుబావులకు, భూగర్భ జలాలు పెరుగుతా యన్నారు. వ్యవసాయకూలీలకు పనులుంటాయాన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. మాబుసాహెబ్, ఈశ్వర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, గోకారి భాష, పక్కిర, శీలన్న, సర్వోత్తమ రెడ్డి, రాజేష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

క్రీడల్లో లక్ష్యంతో రాణించాలి : వైసిపి

ప్రజాశక్తి - పాములపాడు

విద్యార్థులు క్రీడల్లో లక్ష్యంతో రాణించి విజయం సాధించి పాఠశాలకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలని, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పాములపాడు జడ్పిటిసి జ్యోతి రామలింగేశ్వర రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డిలు అన్నారు. గురువారం పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలోని జడ్పిహెచ్ హైస్కూల్ విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర్ రెడ్డి అభినందించారు. వారికి టీ షర్టులను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువు, క్రీడలు రెండు కళ్లలా భావించి లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర, జాతీయ, ప్రపంచ స్థాయికి విద్యార్థులు ఎదగాలన్నారు.ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు పొంది పాఠశాలకు, సొంత గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి వరప్రసాద్, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు టీ షర్టు పంపిణీ చేసిన జడ్పిటిసి

రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి
- ప్రభుత్వ జూనియర్ కళాశా ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఆత్మకూరు

తైక్వాండో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించి పతకాలు సాధించాలని ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ బి. రఘురామ చార్యులు, పాఠశాల హెచ్ఎం కె.నాగరాజు, పిడి ఎండి బ్రహ్మానందం, పిఈటి దేవానంద్‌లు అన్నారు. గురువారం ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. సెప్టెంబర్ 30న కర్నూలులోని అవుట్డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అండర్–19 బాలుర విభాగం కె.మని, పి.పవన్‌లు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించి మాట్లాడారు. తైక్వాండో విద్య ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. శారీరక, మానసిక ఒత్తిడికి లోను కాకుండా తోడ్పడుతుందని, విద్య, ఉద్యోగాలలో తోడ్పడుతుందని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మరెన్నో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను, తైక్వాండో కోచ్‌లు జి.షబ్బీర్ హుస్సేన్, ఎస్. ఖాజా హుస్సేన్‌లను ప్రిన్సిపల్ అభినందించారు. కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ మాట్లాడుతూ కడప జిల్లా రైల్వే కోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 9, 10, 11వ తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు సలీం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పతకాలతో విద్యార్థులను సన్మానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఆదిత్య బిర్లా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ విభాగాలలో 12 స్వర్ణాలు,ఈ పోటీలలో మొత్తం 21పతకాలు సాధించిన విద్యార్థులు సన్మానం చేసినట్లు ప్రధానోపాధ్యాయులు భాస్కరభట్ల కృష్ణమోహన్ గురు వారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ ఆవరణంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు భాస్కరభట్ల కృష్ణ మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అల్ట్రాటెక్ వైస్ ప్రెసిడెంట్ బి.రామారావు,అల్ట్రాటెక్ వైస్ ప్రెసిడెంట్ మైన్స్ టి పి పి కె.యస్.యస్ రెడ్డి, అల్ట్రాటెక్ వైస్ ప్రెసిడెంట్ టిపిపి ముకుల్ పట్వర్థన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిత్య బిర్లా పబ్లిక్ స్కూల్‌కి చెందిన 23 మంది విద్యార్థినీ విద్యార్థులు అక్టోబర్ 26 నుండి 29 వరకు జరిగిన సిబిఎస్ఇ – క్లస్టర్ 7 అథ్లెటిక్ మీట్‌లో 21 పతకాలు సాధించి సత్తా చాటారన్నారు. వివిధ విభాగాలలో12 స్వర్ణాలు,1రజతంతో పాటుగా 8 కాంస్య పతకాలుసాధించారన్నారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు సిబిఎస్ఈ జాతీయస్థాయి అథ్లెటిక్ మీట్ లో పాల్గొనడానికి అర్హత సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను విజయోత్సవ సభలో విద్యార్థులను పతకాలతో, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మిన్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రవరం : రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థి భరత్ అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం నిర్వహించిన అభినందన సభలో ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ రుద్రవరం ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న భరత్ గత నెల సెప్టెంబర్ 25న కర్నూల్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 4,5,6 తేదీలలో తూర్పు గోదావరి జిల్లాలో జరుగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కర్నూల్ జిల్లా జట్టు తరపున భరత్ పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి భరత్‌ను, వ్యాయామ ఉపాధ్యాయులు పి. శ్రీనివాసులును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన భరత్ ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వైసిపి నేతలు బ్యాట్స్ అందజేత

బండి ఆత్మకూరు : మండలంలోని సంత జుటూరు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్ధిని విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన సందర్భంగా గురువారం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కొంగిస శివశంకర్, బుసిరెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, రామలింగేశ్వర్ బారెడ్డి, అశోక్ రెడ్డి హాకీ క్రీడాకారులకు హాకీ బ్యాట్స్ అందించారు. ఈ సందర్భంగా శివ శంకర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి విద్యార్థిని విద్యార్థుల్లో ఉన్న క్రీడా స్ఫూర్తిని బయటికి తీసినందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి గ్రామీణ స్థాయి క్రీడాకారు లను ప్రోత్సహించడం కోసం గ్రామీణ క్రీడలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు హాకీ బ్యాట్ లు అందిస్తున్న దృశ్యం

కార్యక్రమం లో మాట్లాడుతున్న డాక్టర్ సుస్మిత

క్యాన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - నంద్యాల

ఉదయానంద కాన్సర్ సెంటర్, నంద్యాల ఆధ్వర్యంలో నేషనల్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలకు స్త్రీలలో వచ్చే వివిధ రకాల కాన్సర్ వ్యాధుల పట్ల గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఉదయానంద కాన్సర్ హాస్పిటల్ మెడికల్ ఆంకలాజిస్ట్ డా. సుస్మిత మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని అన్నారు. 40 సంవత్సరాల వయసు దాటిన ప్రతీ మహిళ క్రమం తప్పకుండ క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేపించుకోవాలని అన్నారు. నేషనల్ డిగ్రీ కళాశాల తరపున కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, మహిళా అధ్యాపకులు ఇద్దరు డాక్టర్స్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ విద్యాసంస్థల అధినేత డా. యస్. ఇంతియాజ్ అహ్మద్, ఉదయానంద హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డా.హరికృష్ణ పాల్గొన్నారు

5న తుమ్మలపెంటలో గడపగడపకు..

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో ఈనెల 5,6వ తేదీలలో గడప గడప కు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు బనగానపల్లె వైసిపి ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి గారి రాంమోహన్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువి రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమాన్ని శాసన సభ్యులు కాట సాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతు ందని, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీ టీసీలు, సర్పంచ్ వార్డ్ మెంబెర్స్,ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ బాక్సింగ్ పోటీల్లో రాణించిన ఉపేంద్ర

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ పట్టణానికి చెందిన బాక్సర్ ఉపేంద్ర జాతీయస్థాయి పోటీల్లో రాణించి సిల్వర్ మెడల్ సాధించాడు. గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి స్వగృహంలో జాతీయస్థాయిలో రాణించిన బాక్సర్ ఉపేంద్రను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఆత్మకూరు పట్టణానికి చెందిన ఉపేంద్ర మంచి ప్రతిభ కనబరిచి రెండవ స్థానం సాధించి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చాడన్నారు. నియోజకవర్గంలో అన్ని క్రీడలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. క్రీడాకారుల అభివృద్ధి కోసం తాను ఎప్పుడు ముందు ఉంటానని, తనవంతు సహాయ సహకారాలు చేసేందుకు సిద్ధమన్నారు. అనంతరం బాక్సర్ ఉపేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా కార్తీక్ రెడ్డి ప్రత్యేక చొరవతో, ఆర్థిక సహాయ సహకారాలతో జాతీయస్థాయిలో రాణించానని తెలిపారు. వారు చూపిన ఆదరాభిమానాలను జీవితంలో మర్చిపోలేనని, ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, సుల్తాన్, క్రికెట్ సీనియర్ క్రీడాకారుడు ఏఎండి రఫీ పలువురు పాల్గొన్నారు.

బాలికల విద్యను ప్రోత్సహిద్దాం : జెకెఎస్

ప్రజాశక్తి - బనగానపల్లె

బాలికల విద్యను ప్రోత్సహిద్దామని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానందచారి పేర్కొన్నారు. గురువారం మండలం లోని చెరువు పల్లె ఉర్దూ పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షు డు జెఎస్ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బాలిక విద్యను ప్రోత్సహిద్దాం బాల్య వివాహాల ను నిర్మూలిద్దాం అనే కార్యక్రమంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు బాలిక విద్యను ప్రోత్సహించాలని కోరారు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని విజ్ఞప్తి చేశారు. ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నౌషద్ బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న వై.ఆశీర్వాదం

చెంచు గిరిజనులకు పథకాలు అందజేయాలి
- కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై.ఆశీర్వాదం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

చెంచు గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. గురువారం ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చింతల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చెంచు గూడెంలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతల, మర్రిపాలెం, శ్యామ, తుమ్మల బైలు, చిన్నారుట్ల, పెదారుట్లల్లో చెంచులకు రైతు భరోసా, అమ్మ ఒడి పథకాలు అందడం లేదన్నారు. ఈ విషయాన్ని చింతల గ్రామ పంచాయతీ అధికారిని, ఆర్‌బికె సిబ్బందిని అడగగా కొంతమందికి ఆధార్ కార్డులలో ఫోను నెంబరు లింకప్ లేదని చెప్పారన్నారు. రైతు భరోసా చేయాలంటే ఆధార్ ప్రధానమైనదని, చనిపోయిన చెంచు గిరిజనుల మరణ ధృవీకరణ పత్రం లేకపోవడంతో కొంత మందికి పడట్లేదని తెలిపారన్నారు. ఐటిడిఎ పిఒ ఈ చెంచు గ్రామాలను సందర్శించి చెంచుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కుడుముల వెంకటేశ్వర్లు, పి.ఆనంద్, వీరయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.173/2020
మొగల్ మహబూబ్ బేగ్ మరియు ఒకరు ..వాదులు
వర్సెస్
షేక్ కాశింబి మరియు ముగ్గురు ..ప్రతివాదులు
ప్రతివాది చిరునామా :
4వ ప్రతివాది) షేక్ ఖమ్మార్ బాషా తండ్రి షేక్ గపూర్, వయసు సుమారు 41 సంవత్సరాలు, ప్రైవేటు ఎంప్లాయ్, ఇంటి నెంబర్ 29–333, సరస్వతి నగర్, నంద్యాల టౌన్ మండలం, కర్నూల్ జిల్లా.
పై నెంబరు దావాలో వాది దావా ప్లయింటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 20వ తేదీ నవంబర్ నెల 2023 సంవత్సరంలో ఉన్నది. మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.
// కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు ఇట్లు
తేది : 01-11-2023 శ్రీ షేక్ యాసిన్ బాషా
వాది తరపు అడ్వకేట్
గిద్దలూరు, ప్రకాశం జిల్లా
సెల్ : 9346513649

మహారాజ శ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల
O.S. NO.613/2018
దేవరశెట్టి పరమేశ్వరయ్య. ...వాది
వర్సెస్
సాలెముల వెంకటరమణ
వయస్సు 58 సం॥, తండ్రి ఎస్. రంగయ్య
ఎంప్లాయి, పెద్దకొట్టాల గ్రామం,
నంద్యాల మండలం, నంద్యాల జిల్లా. ...ప్రతివాది
ప్రతివాది కి దావా సమన్లు
పై దావా నందు వాది, ప్రతివాది పై దావా దాఖలు చేసి ఉండి. ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ.14-11-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 14-11-2023
ఇట్లు
G. రాంప్రసాద్,
వాది పరం అడ్వకేట్
నంద్యాల.